# అందమైన వెన్నెల

గాలి అలా అలా కదులుతూ కొమ్మల్ని రెమ్మల్ని వూపుతోంది. వెండి వాన కురిసినట్టు వెన్నెల పుడమినిండా పరుచుకుంటోంది. ఇంటికప్పుల మీద డాబాలమీద పుచ్చపువ్వులు పరిచినట్టు వెన్నెల ఎటుచూసినా వెన్నెల - అంద మైన వెన్నెల-కన్నులను హృదయాలను దోచుకునే వెన్నెల—మనసును పరవశ్యు తొక్కించే వెన్నెల—అ వెన్నెలను చూడకుండా వెంకటేశు బామ్మ ఏం చేసిందంటే కిటికీ రెక్కలిని తలుపులని కూడా మూసేసింది.

"ఏఁటే బామ్మా?" అంటే "జలుబు చేస్తుందిరా అలా మంచం వాల్చు కుని పడుకో" అని కసిరింది,

పాపం వెంకటేశు ఎంతైనా యువకుడు. కాసింత మనసు-ఉప్పొంగే గుండె ఉన్నవాడు వెన్నెలను చూడకుండా అలా గదిలో బంధితుడవడానికి ససేమిరా ఇష్టపడలేదు కాని బామ్మకు అతని ఇష్టాయిష్టాలతో పనిలేదే— మాట వరుసకు "బామ్మా! టాబామీదికి వెళ్ళి పడుకుంటానే" అన్నాడనుకో— "డాబామీదికి వెళ్ళి పడుకుంటావా? చలివేయదూ? జొరంతగలదూ? అని తగులకుంటుంది. గుక్క తిప్పుకోకుండా అరగంటసేపు మాట్లాడి హడలగొట్టేస్తుంది. వెంకటేశు బిక్క మొగం వేసుకుని పిల్లిలా నవారుమంచంలో ముడుచుకుని పడుకోవాల్సిందే.

వెంకటేశు నవారుమంచం వంక కోపంగా చూశాడు వస్తువులమీద వెంక టేశుకు భలే కోపం

వెన్నెల వెండిధారలా కురుస్తున్న వెన్నెల....

"ఆ వెన్నెలలో ఆకాశాన్ని చుక్కలని చూస్తూ డాబామీద పడుకోవాలని వెంకటేశు తహతహ.

"బామ్మా వెన్నెలను చూస్తూ డాబామీద పడుకుంటానే" అని డైరెక్టుగా అన్నాడే అనుకో-

"అవ్వ ఏమిటేమిటి?" అని బుగ్గలు నొక్కుకుంటుంది బామ్మ అంతేనా? పొద్దున లేవగానే పక్కింటి బామ్మను పిలిచి- "మా మనవరాలు సమర్తయింది" అని చెప్పేంత కుతూహలంగా "మావాడు రాత్రి వెన్నెల్లో పడుకుంటానన్నాడు" అని చెబుతుంది.

ఆ బామ్మకూ....అదే పక్కింటి బామ్మకూ ఇప్పుడు చంద్రుడంటే ఓ అప్పడం.—వెన్నెలంటే అరబెట్టుకునే వస్తువులేవో గుర్తుకొస్తాయి.

అసలు ఈ బామ్మలంతా తమ వయసునాటి అచ్చట్లు ముచ్చట్లు మరచి పోయి వయసుమనవలు. మనవరాళ్ళ ముచ్చట్లమీద దాడిచేస్తుంటారు.

కిటికీముందు నుంచుని వర్షాన్ని చూస్తే చాలు. జలుబుచేస్తుందట, వెన్నెల్లో పడుకుంటే జలుబుచేస్తుందట హాయిగా గాలిలో నడిస్తే జలుబు చేస్తుందట. చేస్తే చేసింది. వెధవజలుబు రెండు మందు బిళ్ళలు మింగితే అదే పోతుంది. మింగ కున్నా పోతుంది.... కాని వెన్నెల వాన-ఆ అనుభవాలకోసం పడుచుగుండె పడే ఆరాటాన్ని ఈ బామ్మలు అర్థంచేసుకోరేం?

బామ్మ అటువేపు తిరిగిఉంది కనుక ఓకసారి ఆమెవంక కొరకొరా చూశాడు వెంకటేశు.

ఎదమపక్కవాటా పరశురాంకు-"మావాడు వెన్నెల్లో పడుకుంటానన్నాడు" అని బామ్మ చెప్పదు. ఎందుకంటే ఆయన చెప్పే జవాబు బామ్మకు నచ్చదు.

"వెన్నెల్లో పడుకుంటానన్నాడా? మంచిదే కదా పెద్దమ్మా ఏ బూతు కథో భూతం కథో చదివి ఆరోగ్యంపాడు చేసుకోకుండా టూ ప్లస్ వన్ కథలు చదవి సంసారాలు కుల్చకుండా మీ వాడు వెన్నెల్లో విహరిస్తానంటున్నాడు నయమే కదా?" అంటాడు.

"ఏం నయమో?" మూతి తిప్పుతుంది బామ్మ ఏ విహారాలకు పోకుండా మనవడు పప్పు దువ్వలా అప్పడాల కర్రల గదిలో పడి ఉండటమే ఆమెకిష్టం.

"బామ్మా"

"ఊఁ...

"బామ్మా బామ్మా"

"ఏవిట్రా? ఆ కసురు విసురుకు వెంకటేశు గొంతులోని మాట ఎగిరి పోయింది.

"ఏం లేదు బామ్మా వార్తలొస్తున్నాయి రేడియో పెట్టనా?"

ఏదో మాట్లాడబోయి ఏదో అన్నాడు

"ఊఁ"

రేడియో ఆన్ చేశాడు.

"ఆకాశవాణి వార్తలు చదువుతున్నది దుగ్గిరాల పూర్ణయ్య"

ఆ వార్తల్ని తనకు అనుకూలంగా మార్చుకోవాలని విఫల ప్రయత్నం చేశాడు. వెంకటేశు

"విన్నావే? బంగాళాఖాతంలో వాయుగుండం లేదు. వచ్చే ఇరవై నాలుగు గంటల్లో వాతావరణంలో మార్పు లేదు. బామ్మా ఈ రాత్రి డాబా మీద పడు కుంటానే"

"నోర్మూయ్యరా? నేను రేడియో మాటలు సమ్మేంత మూర్ఖురాలిని అను కున్నావా? రాత్రికి వర్షం వస్తుంది. నువ్వుడాబా మీద పడుకోవడానికి వీల్లేదు.

"వర్షం పడితే కిందికి దిగి వచ్చేస్తానే ఆకాశంలో ఒక్క మబ్బు తునకా లేదు.

"నిన్ను నోర్మూయ్యమన్నానా?"

ఇక బామ్మను ఒప్పించడం ఆ బ్రహ్మ తరం కూడా కాదు. తనకిక ఆ రోజు వెన్నెల్లో డాబా మీద పడుకునే యోగం లేదు. అయ్యో? వెన్నెలా పుచ్చ పువ్వులాంటి వెన్నెలా?

"గదిలో ఉక్కగా ఉంది బామ్మా"

"ఉక్కగా ఉందా ? ఫ్యాన్ వేసుకో."

ఆ ఫ్యాన్ కనిపెట్టిన వాడెవడో వాణ్ణి కసితీరా బాదాలనిపించింది. ఆ ఫ్యాన్ ముక్కలు ముక్కలుగా విరిచేయాలనిపించింది. ఆ ఫ్యానే కదూ గదిని సమాధిగా మారుస్తున్నది.

కరెంటు పోయినా బాగుండేది.

ఫ్యాన్ ఆగిందన్న సాకుతోనైనా డాబా మీదికి చెక్కేసి వెన్నెలను చూస్తూ పడుకోవచ్చు-

కాని ఇటువంటి సమయాల్లో ఎందుకు పోతుంది కరెంటు?— భోజనం చేస్తున్నప్పుడో పరీక్షలకు చదువుతున్నప్పుడో పోతుంది.

బామ్మ ... నీకు పుణ్యం ఉంటుందే-నన్ను డాబా మీద పడుకోనీయవే— అసలు ఇంటి ఓనరుకు లేని అభ్యంతరం నీకెందుకట? జలుబు చేస్తుందట— జ్వరం వొస్తుందట-బామ్మలంతా ఇలా జలుబుల్ని - జొరాల్ని ఆపితే డాక్టర్ల గతేం కావాలి?

"ఏమిట్రా చదువుకోవూ?"

"చదువుకున్నానే—"

"వ్రాసుకోవూ? ..."

"రాసుకున్నానే...."

"అయితే పడుకో ..."

"పడుకుంటానే"

'బామ్మా! ఈ ఒక్కరోజు డాబా మీద పడుకుంటానే' అన్న మాట చివరి దాకా వచ్చి ధైర్యం లేక ఆగిపోయింది-

చిన్నప్పటి నుంచి బామ్మ చేతుల్లో పెరిగాడు, అదిగో పిల్లి, ఇదిగో ఎలుక అంటే అన్నం తిన్నాడు, ఇప్పుడు సింహంలా ఎలా గర్జిస్తాడు.

తన మనసులోని మాట గట్టిగా చెప్పడానికి బోరింగ్ నీళ్ళు మింగుతున్నాడు-

బామ్మను ఒప్పించే ఉపాయాల కోసం వెదుకుతున్నాడు.

బామ్మది ఉడుంపట్టు.

అలాంటి పట్టు మంచిదే కాని-అన్ని సందర్భాలలోకాదు. తెలుగు మాస్టారు చెప్పారు. కదా-గతం మైనస్-చాదస్తం ఈక్వల్టు గట్టి పునాది-బామ్మ ఉడుం పట్లు కొన్ని వెంకటేశుకు లాభించాయి. ముఖ్యంగా ఆహారం, నిద్ర, చదువు విషయంలో-అందుకే బామ్మ సలహాలను పూర్తిగా కొట్టిపడేయడు.

డాబా మీది వెన్నెల్లో పడుకునే విషయంలో - మాత్రం అలా కాదు. బామ్మను ఎదిరించాలి - ఎదిరించాలి - ఎదిరించాలి అనుకున్నాడు — కాని-ఎదలో ఆ బలం ఏదీ?

చెద్దరు పరచని నవారు మంచం మీద కూర్చుని - ఆ తరువాత పడుకుని గిరగిరా తిరిగే సీలింగ్ ఫ్యాన్ వంక చూస్తున్నాడు-మూసి ఉన్న కిటికీల వంకా. గడియ పెట్టి ఉన్న తలుపుల వంకా చూస్తున్నాడు - తలపుల్లో కొట్టుకుంటున్న గుండె చప్పుడు వింటున్నాడు-

నిరాశతో కళ్ళు మూసుకున్నాడు—

తలుపు మీద "టక్ టక్" అని శబ్దమయింది.

గడియారం వంక చూశాడు—ఎనిమిది కాబోతోంది-ఇప్పుడెవరొస్తారు తన కోసం బామ్మ విషయం తెలిసే?

"ఎవర్రా?" బామ్మే తలుపు తెరిచింది.

"ఒసే నువ్వటే సుందరీ?"

సుందరి?

ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు వెంకటేశు.

తన మామ కూతురు సుందరి, వాళ్ళ అమ్మ వచ్చారు.

"బండి లేటయింది అమ్మమ్మా! మధ్యాహ్నం రావలసిన బండి ఇదిగో ఇప్పుడొచ్చింది."

"ఈరోజే వచ్చినందుకు సంతోషించాల్నే తల్లీ-లేటుగా రాకపోతే అది మన రైలుబండి ఎలా అవుతుంది? ఒరే వెంకటేశు ఈ సామాను "అందుకో."

ఉత్సాహంగా లేచాడు వెంకటేశు. మామకూతురు సుందరిని చూసికాదు ఆ ఉత్సాహం ఆ సమయంలో తమ ఒక్కగదికి అతిథులొచ్చారూ అంటే తనకు డాబా మీద వెన్నెల్లో గడిపే అవకాశం వచ్చినట్లే.

తను, బామ్మ మూడేళ్ళ నుంచీ ఆ గదిలోనే అద్దెకుంటున్నారు. 'చదువు పూర్తయి ఉద్యోగం దొరికిన తరువాతే రెండు గదుల ఇల్లు తీసుకునేది' అని ఉడుంపట్టు పట్టింది బామ్మ. ఎవరైనా అతిథులొస్తే ఇబ్బందే.

ఈ దెబ్బతో బామ్మ చాప, దిండు తన చేతికిచ్చి 'డాబా మిద పడుకో నాయన' అని చెప్పేది ఖాయం అనుకున్నాడు. అదీ అతని ఉత్సాహం.

అరగంట దాకా కుశల ప్రశ్నలు, చుట్టాల కూపీలు కొనసాగాయి.

ఆ అరగంట సేపట్లో మావ కూతురు సుందరి తన కలువ కళ్ళతో అర డజను సార్లయినా వెంకటేశు వంక చూసింది.

వెంకటేశుకు గది నిండా వెన్నెలే కనిపించింది. అతని గుండె లయ తప్పింది.

"వెంకటేశూ!"

"ఊఁ "

"ఇదిగో చాప, దిండు నాయనా! పోయి డాబా మీద పడుకో."

నివ్వెరపోయి చూశాడు వెంకటేశు.

"బామ్మా!"

"ఏమిట్రా?"

"డాబా మీద దాహం వేస్తేనో?"

"మంచి నీళ్ళ చెంబు, గ్లాసు పెడ్తాను కదా?"

"మరే ..."

"ఊఁ .."

"పిల్లి పడేస్తేనో?"

కిసుక్కున నవ్వు

బామ్మది కాదు....మావకూతురు సుందరిది!

గుండె ఝల్లుమంది వెంకటేశుకు.

గుండె ఝల్లులు, వాటి తాలూకు నరాల్లో పరుగులు వెంకటేశుకు కొత్త.

"పాలు, పెరుగుల కోసం వస్తుంది గాని వెర్రి వెంకటేశూ, నీళ్ళకోసం వస్తుందిరా పిల్లి?"

"మారు మాట్లాడకుండా చాప, దిండు తీసుకొని డాబా మీదికి కదిలాడు వెంకటేశు.

ఒరే నాయనా!''

"ఏవిటే?"

"ఇదిగో రగ్గు-చలేస్తే కప్పుకో"

'చూడొద్దు' అనుకుంటూనే అటు చూశాడు. సుందరి వాలు చూపులు మరో సారి అతని గుండెలో దిగాయి-

డాబా మీద పక్క వేసుకొని రీలింగ్‌ను అనుకొని నిల్చున్నాడు వెంకటేశు

ఎటు చూసినా కన్నుల పండువుగా పండు వెన్నెల. తోడుగా చల్లని మెల్లని పిల్లగాలి. ఊగే గుల్‌మొహర్ కొమ్మలు, కొబ్బరి మట్టలు, వెన్నెల్లో చలువరాతి మందిరాల్లా మెరిసే మేడలు.

ఆ డాబా మీది నుంచి వీధులు అందంగా కనిపించాయి. నగరం సుందరంగా కనిపించింది. దేశమే నందనవనం అనిపించింది. లోకం ఆనంద డోలికల్లో ఊగుతోంది. వెంకటేశు మనసు పరవశించి ఉద్వేగంతో ఉరకలు వేసింది. 'ఎంత గొప్పది మానవ జన్మ' అనుకునేదాకా వెళ్ళాడు.

మావకూతురు సుందరి గుర్తుకొచ్చింది· గాలిలో గులాబీ సువాసనలు గుప్పుమన్నాయి.

కిందిగదిలో అతిధులకు భోజనం వడ్డించి కబుర్లు చెబుతున్నది బొమ్మ.

"అమ్మా బుక్కెడు అన్నంపుంజే వెయ్యి తల్లీ"

ఓ పసివాడు. మొలకు జానెడు గుడ్డ మాత్రం ఉంది. చేతిలో రాతెండిచిప్ప పట్టుకుని దీనంగా అడుక్కుంటున్నాడు.

బడికి పోయే వయసు అది.

అమ్మ లాలింపుతో అన్నంతిని హాయిగా ఆదమరిచి నిద్రపోయే సమయం అది. వీధిలో నిలబడి దీనంగా అడుక్కుంటున్నాడు,

ఆ పసివాడిమీద వెంకటేసు దృష్టి పడింది. అతని గుండె తరుక్కుపో

యింది. మైకంలోంచి తేరుకుంటున్నట్టు ఒక్కసారి తల విదిలించి చూశాడు. ఆ పసివాడు వెంకటేశు గుండె తవ్వుతున్నాడు.

"పోరా పో!"

కసురుకునే గడపలు—

దీనంగా మరో గడపముందు నుంచున్నాడు.

"అమ్మా-బుక్కెడు అన్నం వేయి తల్లీ?"

ఎంత ఆకలితో ఉన్నాడో పాపం.

"ఊఁ- వీళ్ళకో అంతనేది లేదు ఇప్పుడు వీడికి వేశామో, తరువాత వీడి చెల్లో. అన్నో వస్తారు ఆ తరువాత వాడి తల్లి తండ్రి—వరుసగా ఇంటిమీద దాడిచేస్తారు. వెధవగోల, వెధవగోల!" అని విసుక్కుంటున్నది బామ్మ.

మెట్లదాకా వచ్చిన వెంకటేశు ఆ మాటలు విన్నాడు.

"బామ్మా! ఆ పసివాడికి ఓ ముద్ద వెయ్యవే!" అని చెప్పడానికి వచ్చి చెప్పలేకపోయాడు.

బామ్మ కసురుకుంటుందేమో-అదీ మావకూతురు సుందరి ముందు.

తిరిగి డాబామీదికి వెళ్ళిపోయాడు. అతను మెట్లు ఎక్కుతుంటే దిగుతున్నట్టు అనిపించింది.

అతని మనసంతా ఆ పసివానిచుట్టూ తిరుగుతున్నది

అతను గిల్టిగా ఫీలవుతున్నాడు.

ఎవరో అన్నమాటలు గుర్తుకొచ్చాయి. భిక్షవేసి వాళ్ళను శాశ్వతంగా అడుక్కునేట్టు చేస్తున్నాం.

అసలు మనతోటి మనుషులు ఎందుకు యాచిస్తున్నారు? పేదరికం వల్ల ఆ పేదరికం పోతేకదా యాచన మాయమయ్యేది?

అప్పటిదాకా ఈ దీనులు ఆకలితో మలమల మాడి చావాల్సిందేనా?

పేదరికం రూపుమాపటం, యాచన అనేది లేకుండాచేయటం దీర్ఘకాలిక చర్య. మరి తక్షణకర్తవ్యం ఏమిటి? చేతనైనంత తోటివారికి సహాయం చేయడమే అది భిక్షకాదు సహాయం.

వెంకటేశు కళ్ళల్లో దీనంగా అడుక్కుంటున్న ఆ పసివాడే కదులుతు న్నాడు. ఎత్తయిన ఆ భవనాలు నునుపైన రోడ్లు-వీధులు అతనికి వికృతంగా కనబడుతున్నాయి. అతను గిల్టీగా ఫీలవుతున్నాడు.

'అడుక్కోవడం అనేది ఖర్మ కాదు కాదు కాదు'-అని అతని అంతరాత్మ ఘోషిస్తున్నది అతను గిల్టీగా ఫీలవుతున్నాడు.

ఆ పసివాడు అతని గుండెను తవ్వుతున్నాడు.

అతనిలోని సంస్కారం మేల్కొన్నది. అతనిలోని వివేకం మేల్కొన్నది. అతనిలోని మానవత్వం అడుగు ముందుకువేసింది.

అతను తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు.

డాబాదిగి వచ్చాడు. సరాసరి వంటగిన్నెల దగ్గరికి వెళ్ళాడు.

"పళ్లెంలో అన్నం, కూర వేసుకున్నాడు.

"ఏవిట్రా వెంకటేశు?"

బామ్మ నివ్వెరపోయి చూస్తున్నది.

"ఆ పసివాడికి ఇస్తా బామ్మా!"

వెంకటేశు గొంతులోని దృఢత్వానికి బామ్మ నోట మాటరా లేదు.

పళ్లెంలో వేసిన అన్నాన్ని తీసుకొని వీధిగుమ్మం దగ్గరికి పోయి పిలిచాడు,

నిరాశతో వెళ్ళిపోతున్న ఆ పసివాడు ఆత్రతగా వెనక్కి తిరిగి వచ్చాడు.

ఆ చిప్పలో అన్నం, కూర వేశాడు వెంకటేశు.

ఆ పసివాడి కళ్ళు ఆనందంతో మెరిశాయి.

మెరిసే ఆ కళ్ళలో అందమైన వెన్నెల కనిపించింది వెంకటేశుకు.

(ఆంధ్రప్రభ వీక్లీ 14-10-1987)